'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com


## నమస్తే తెలంగాణ

# భారత్‌కు 'కోవర్టు' సంకటం

**విదేశీగడ్డపై** అనధికారికంగా చేపట్టే హత్యలు, దాడులను కోవర్టు ఆపరేషన్లు అంటారు. అమెరికా, రష్యా, ఇజ్రాయెల్, చైనా వంటి దేశాలకు ఈ తరహా ఆపరేషన్లు జరిపిన చరిత్ర ఉంది. అమెరికా, ఇజ్రాయెల్ ఈ విషయంలో మరీ దుందుడుకుగా పోతాయి. అవి విదేశాల్లో జరిపిన కోవర్టు ఆపరేషన్ల గురించి కథలు కథలుగా చెప్పుకొంటారు. ఆ కథల ఆధారంగా అనేక జనరంజక చిత్రాలూ వచ్చాయి. ఆయా దేశాలు ఆ ఆపరేషన్ల గురించి మొదట్లో ఖండించినప్పటికీ ఏతావాతా అంగీకరించడం తెలిసిందే. పాలస్తీనా తీవ్రవాదులు ఇజ్రాయెలీ పౌరుల విమానాన్ని హైజాక్ చేసి ఉగాండాకు తరలించడం, ఇజ్రాయెలీ కమాండోలు విమానంలో వెళ్లి హైజాకర్లను తుదముట్టించి బందీలను విడిపించుకు రావడం ఓ వీరోచిత గాథగా ప్రచారంలోకి వచ్చింది. ఈ ఉదంతం ఉగాండా విమానాశ్రయం పేరు మీద 'ఎంటెబీ ఆపరేషన్'గా ప్రసిద్ధి పొందింది. ఈ ఆపరేషన్ సందర్భంగా అమరుడైన యోనాతన్ నెతన్యాహూ తమ్ముడే ప్రస్తుత ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ. 'ఎంటెబీ'పై పలు సినిమాలూ వచ్చాయి. తాజాగా ఇండియాపై ఈ తరహా కోవర్టు ఆపరేషన్లకు సంబంధించిన ఆరోపణలు వస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. అంతర్జాతీయంగానూ పన్నూ హత్య కుట్ర సంచలనం కలిగిస్తున్నది.

మన దేశంలోనూ దీనిపై చర్చ జరుగుతుండటం గమనార్హం. ఇందుకు ప్రధానంగా రెండు అంశాలు కారణం. కెనడాలో హర్దీప్‌సింగ్ నిజ్జర్ అనే ఖలిస్థాన్ వేర్పాటువాది హత్య మొదటిది కాగా, అమెరికాలో మరో ఖలిస్థాన్ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్య కుట్ర రెండోది. నిజ్జర్‌ను చంపించింది భారతీయ అధికారులేనని కెనడా ఆరోపించడంతో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన సంకటం ఎదురైంది. రెండోదైన పన్నూ హత్యకుట్ర వెనుక భారత దౌత్యాధికారులున్నారని అమెరికా అంటున్నది. పన్నూను హత్య చేసేందుకు హిట్‌మ్యాన్‌కు ఓ భారత సంతతి వ్యక్తి సుపారీ ఇచ్చేందుకు ప్రయత్నించడంతో వ్యవహారం బయటకు వచ్చింది. హిట్‌మ్యాన్‌గా నటించిన అమెరికా ఏజెంటు గుట్టును రట్టు చేశాడు. ఈ కుట్ర వ్యవహారం ఓ భారతీయ దౌత్యాధికారి కనుసన్నల్లోనే జరిగిందని అమెరికా ఆరోపిస్తున్నది. ఇదీ ఓ సినిమా కథలాగే ఉత్కంఠభరితంగా ఉన్నదనడంలో సందేహం లేదు. ఆ సంగతి అలా ఉంచితే, పన్నూ అమెరికా పౌరుడు కావడం ఇక్కడ అసలు సమస్య అయింది. తమ గడ్డ మీద, తమ పౌరుడి హత్యకు భారత అధికారి కుట్ర పన్నారనేది అమెరికా ఆరోపణ. దీనిపై చర్య తీసుకోవాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌పై కూడా రాజకీయ, న్యాయపరమైన ఒత్తిళ్లు వస్తున్నాయి.

బైడెన్ ఆదేశాల మేరకు అక్కడి గూఢచార సంస్థ సీఐఏ అధిపతి విలియం బర్న్స్ గత ఆగస్టులో భారత్‌లో పర్యటించి పన్నూ కేసుపై వాకబు చేసి వెళ్లారు. సెప్టెంబర్‌లో జీ-20 సదస్సు సందర్భంగా ప్రధాని మోదీతోనూ అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఈ వ్యవహారాన్ని ప్రస్తావించినట్టు సమాచారం. నవంబర్‌లో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ పర్యటన సందర్భంగానూ ఇది ప్రస్తావనకు వచ్చినట్టు వార్తలు వెలువడ్డాయి. ఈ వ్యవహారంపై రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో తీవ్ర సమస్యలు తలెత్తుతాయని అమెరికా కాంగ్రెస్ సభ్యులు ఇటీవల నేరుగానే హెచ్చరిస్తుండటం చర్చాంశమైంది. అమెరికా ఆరోపణలపై భారత విదేశాంగమంత్రి జైశంకర్ స్పందిస్తూ.. కెనడా, అమెరికా అంశాలు రెండూ ఒకటి కాదని అన్నారు. భారత్ బాధ్యతాయుతమైన దేశమని, ఎలాంటి దర్యాప్తుకైనా సహకరిస్తుందని దౌత్యపరిభాషలో వివరించారు. మిగతా దేశాల్లాగా కోవర్టు ఆపరేషన్లు జరపడం భారత్ ప్రకటిత విధానం కాదు. కానీ అమెరికా, కెనడా వివాదాల కారణంగా భారత్ వైఖరిలో ఇటీవలి కాలంలో ఏవైనా మార్పులు వచ్చాయా అనే సందేహాలు వ్యక్తం అవుతుండటం సహజమే.




## ప్రజాస్వామ్యం అపహాస్యం



'పార్లమెంటే సుప్రీం' అని కేంద్రం భావిస్తుంటే భయమెందుకు? ప్రతిపక్ష సభ్యులందరినీ సస్పెండ్ చేస్తే.. ప్రజల గొంతును ఎవరు వినిపిస్తారు? ఈరోజు పార్లమెంట్‌లో ప్రజా గొంతు ఉక్కిరిబిక్కిరైంది. ప్రజాస్వామ్యం అపహాస్యం అయ్యింది. మూడు ముఖ్యమైన బిల్లులను ఆమోదిస్తున్నారని.. ప్రతిపక్ష సభ్యులందరినీ సస్పెండ్ చేసే నైతిక హక్కు వారికి లేదు.

-మమతా బెనర్జీ,
పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి


# బలి పశువుల కోసం వెతకొద్దు

కొత్తగా ఏర్పడిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఒక విషయం గుర్తుంచుకోవాలి. గత ప్రభుత్వ పాలనలో ఏవైనా లోపాలున్నట్లు భావిస్తే వాటిని ఎత్తిచూపటం కొద్దికాలం వరకు సరే. కాని ఆ పని దీర్ఘకాలం పాటు చేస్తూపోయినా, స్వయంగా తాము నెరవేర్చని హామీలకు బలి పశువులను, సాకులను గత ప్రభుత్వంలో వెతుకుతూ పోయినా ప్రజలు హర్షించరు. అందుకే గదా మీకు అధికారం ఇచ్చింది? చేస్తామన్నవి చేయకుండా సాకులు వెతుకుతారా? అంటారు. ఆ ధోరణిని అసమర్థతగా తీసుకుంటారు.

కేసీఆర్ ప్రభుత్వపు మంచిచెడులు ఏమిటన్నది ప్రజలు తమ పద్ధతిలో తాము ఇప్పటికే చూశారు. ఆయన తమకోసం ఎంతెంతో చేసినట్టు ఎన్నికల ముందు చెప్పుకున్నట్టే ఆ తర్వాత కూడా చెప్పుకొంటున్నారు. అయినప్పటికీ ఎన్నికలలో ఓటమి ఎందుకు సంభవించిందనే ప్రశ్నపై పట్టణాల్లో, గ్రామాల్లో నిరంతర చర్చలు సాగుతున్నాయి. కేసీఆర్ పాలన చేసిన మేలేమీ లేదన్నది సార్వజనీన అభిప్రాయమై ఉంటే వారి తీర్పు బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా మహా తీవ్రంగా ఉండేది. కానీ తీర్పు అట్లా లేదు. చర్చలు అట్లా సాగటం లేదు.



టంకశాల అశోక్




రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి రాగల కాలంలో పరిపాలన సాగించేందుకు ఈ విధమైన స్పృహ కూడా పలు భూమికలలో ఒకటి కావాలి. సూటిగా చెప్పాలంటే, ఆయన ప్రభుత్వం గత ప్రభుత్వ పాలనలో బలి పశువులను వెతుకుతూ, తమ హామీలు నెరవేర్చని తనాన్ని ఆ బలి పశువులకు అంటగడుతూ పోవాలని చూస్తే, అందుకు ప్రజలు ఒప్పుకోగల పరిస్థితులు లేవని గుర్తించాలి.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు ఇప్పుడు సూటిగా చూస్తున్నది హామీల అమలు కోసం. ప్రజలు కొన్నేండ్ల కిందటి వరకు కన్జర్వేటివ్‌గా ఉండేవారు. మన దేశపు దీర్ఘకాలిక ఫ్యూడల్ వ్యవసాయిక నేపథ్యం, గ్రామీణ కుల సమాజం, మత ప్రాబల్యం, నెమ్మదిగా సాగే అరకొర సంస్కరణలు, పేదరికం, నిరక్షరాస్యత, బలమైన కుటుంబ వ్యవస్థల వంటి పరిస్థితులలో ఈ కన్జర్వేటిజం రూపుదిద్దుకొని వర్ధిల్లింది. ప్రజలు రాజకీయ పార్టీలను చూడటం గాని, ప్రభుత్వాల నుంచి ఏదైనా ఆశించటం గాని అందుకు అనుగుణంగానే ఉండేది. ఆ కాలమంతా ప్రజలు అల్ప సంతోషులు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాల కోసం ఓపికగా ఎదురుచూసేవారు. ఇద్దరికి ఏదైనా లభిస్తే తక్కినవారు తమ వంతు కోసం వేచి ఉండేవారు. నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ వరకు, ఆ తర్వాత కూడా ఈ స్థితి ఉండేది.

> కాని 1990లు వచ్చేసరికి ప్రజల ఆలోచనలు, స్వభావాలు మారటం మొదలైంది. ఆర్థిక సంస్కరణల ప్రభావం కూడా పడసాగింది. అందుకు తగినట్టు కొత్త తరాలు ముందుకువచ్చాయి. ఫ్యూడల్ పట్టుసడలి నెమ్మదిగా పెట్టుబడిదారీ ఆర్థికాభివృద్ధి, మనుషుల అవసరాలు, పరిసర పరిస్థితులు, వేగంగా సాగుతుండిన పట్టణీకరణ, కన్జ్యూమరిజం, విదేశాలకు ఎక్స్‌పోజర్, పెరుగుతున్న చదువుల వంటివి కనిపించసాగాయి.

ఇక్కడ నక్సలైట్ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం, కొన్ని సామాజిక ఉద్యమాలు తెచ్చిన చైతన్యం అందుకు అదనమయ్యాయి. దీనంతటి ప్రభావంతో ప్రజలు, యువతరాలు ఆయా రాజకీయపార్టీలను చూసే సరళి కూడా సహజంగానే మారసాగింది. మంచిచేసిన నాయకునికి అభిమానంతో కట్టుబడి ఉండటం క్రమంగా తగ్గుతున్నది. తన జేబు నుంచి ఇస్తున్నాడా, ఎవరొచ్చినా ఇస్తారనే ధోరణి పెరుగుతున్నది. ఈ విధమైన ఓటరు పరివర్తన, సామాజిక, ఆర్థిక పరివర్తనను అన్ని పార్టీలు అర్థం చేసుకోవటం మంచిది.

ఇదంతా చర్చించటం ఎందుకంటే, ఇప్పుడు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు ఒకప్పటి వలె ఓపికగా దీర్ఘ కాలం ఎదురుచూసే పరిస్థితి లేదు. మరొక మాటలో చెప్పాలంటే హనీమూన్ కాలం ఇప్పుడు అతి చిన్నది. ఉదాహరణకు ఇందిరాగాంధీ గరీబీ హటావోలో జరిగినవి అరకొర అయినా ఏండ్ల తరబడి వేచి ఉండిన ప్రజలు, కేసీఆర్ దళిత బంధు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఒక పక్క నుంచి క్రమంగా ఇస్తుండినా తక్కినవారు ఓపిక పట్టలేకపోయారు. దీనంతటి సారాంశం ఏమంటే, రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హామీల అమలు ఆలస్యమైనా లేక అసలు అమలు కాకపోయినా, అందుకు గత ప్రభుత్వంలో బలి పశువులను వెతికితే ప్రజలు హర్షించబోరన్న మాట.

అట్లాగని ఇంతకాలపు పరిపాలనను కొత్త ప్రభుత్వం అసలు సమీక్షించవద్దని కాదు. సమీక్షించవచ్చు, అందులో లోపాలు కనుగొంటే సరిదిద్దవచ్చు, మంచిని గ్రహించదలచుకుంటే గ్రహించవచ్చు. అంతే తప్ప, ఒక వేళ తాము మునుముందు విఫలమైతే అందుకు సాకులు వెతికిపెట్టుకోవటమే సమీక్షల పరమోద్దేశం కాకూడదు. ప్రజలు ఆమోదించనిది సరిగా ఈ వైఖరినే. పైగా, కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాలలో ఏమేమి చేసిందన్నది ప్రజల కళ్లెదుట ఉన్నప్పుడు, వారి అనుభవంలోని విషయమైనప్పుడు, వాస్తవం ఏమిటి? కొత్త ప్రభుత్వం తన హామీలను అమలుపరుస్తున్న తీరేమిటి? అన్న విషయాలన్నింటిని ప్రజలు బేరీజు వేసుకోవటం ఎక్కువ ఆలస్యం లేకుండానే మొదలవుతుంది.

ఇప్పుడు ఒకసారి కాంగ్రెస్ మ్యానిఫెస్టోను చూద్దాం. ఆ 42 పేజీల పత్రంలో 37 భాగాలున్నాయి. అవిగాక సుపరిపాలన, 6 గ్యారంటీల కార్డు, 5 డిక్లరేషన్లు, అనుబంధ మ్యానిఫెస్టో పేర జాబ్ క్యాలెండర్లున్నాయి. వీటిలో వారు అన్నింటికన్న ఎక్కువగా ప్రచారం చేసింది గ్యారంటీల కార్డు గురించి. దాని అమలుకు 100 రోజుల గడువును వారే ప్రకటించారు. అదిగాక జాబ్ క్యాలెండర్‌లో ఆయా ఉద్యోగాలకు నిర్దిష్టమైన తేదీలు ఇచ్చినందున అవికూడా గడువుల వంటివే. అంతేకాదు, అధికారానికి వచ్చిన తర్వాత తొలి మంత్రి వర్గ సమావేశంలోనే 6 గ్యారెంటీలకు చట్టబద్ధత, మెగా డీఎస్సీ ప్రకటన, 9వ తేదీ నాడు రూ.2 లక్షల రుణ మాఫీ వంటి ఇతర నిర్దిష్టమైన హామీలున్నాయి. గడువు అయితే 100 రోజులు ఉన్నప్పటికీ, యాసంగి పంటలు మొదలవుతున్నందున అందుకోసం రైతు భరోసా కింద రైతులకు ఎకరానికి ఈ విడతగా రూ.7,500, కౌలుదార్లకు రూ.7,500 చొప్పున వెంటనే ఇవ్వవలసి ఉంది. కల్లాల్లో ఉన్న పంటను కొనటంతో పాటు, క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాల్సి ఉంది. వీటన్నింటి పరిస్థితి (జాబ్ క్యాలెండర్‌లో మొదటిది అయిన గ్రూప్ వన్‌కు ఫిబ్రవరి 1 వరకు సమయం ఉంది.) ఏమిటో అందరూ చూస్తున్నదే.

100 రోజుల గడువు గల గ్యారంటీ కార్డు విషయానికి వస్తే, అందులోని అంశాలు 6. వాటిలోని ఉప అంశాలన్నింటిని లెక్కిస్తే మొత్తం హామీలు 13. వాటిని పేర్కొనాలంటే, 1.మహాలక్ష్మి. అందులో భాగంగా మహిళలకు ప్రతి నెల రూ.2500, బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కు గ్యాస్ సిలిండర్. 2.రైతు భరోసా. అందులో భాగంగా రైతులకు ఎకరానికి ఏడాదికి రూ.15,000. కౌలు రైతులకు ఎకరానికి ఏడాదికి రూ.15,000. భూమిలేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12,000. వరి పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్. 3. గృహజ్యోతి కింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు. 4.ఇందిరమ్మ ఇండ్లు. అందులో భాగంగా ఇల్లులేని వారికి ఇంటి స్థలం, రూ.5 లక్షలు, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం. 5.యువ వికాసం. అందులో భాగంగా విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, అదిగాక ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూళ్లు. 6.చేయూత. అందులో భాగంగా నెలవారీ పింఛన్లు రూ.4,000కు పెంచటం. రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10 లక్షలకు హెచ్చించటం. వీటన్నింటి అమలుకు గడువు 100 రోజులు. అంతేగాక ఈ కార్డుకు చట్టబద్ధత కల్పించటం. దాని అర్థం ఈ అన్నింటిలో ఏది అమలుకాకపోయినా, వాటి అమలు కోసం ప్రజలు కోర్టుకు వెళ్లవచ్చునన్న మాట.

> ఈ మొత్తం 13 ఉప అంశాల్లో ఇప్పటికి అమలుకు తెచ్చినవి రెండు. ప్రభుత్వం 7వ తేదీన ఏర్పడిన తర్వాత మొదటి రెండు రోజుల్లోనే ఆరింట రెండింటిని అమలుచేసినట్టు ప్రజలకు చెప్తున్నది. కాని అది నిజం కాదని గ్యారంటీ కార్డును చూసినట్టయితే స్పష్టమవుతుంది. మహాలక్ష్మి, చేయూత అనే రెండు అంశాలలో గల ఐదు ఉప అంశాలలో ఉచిత బస్సు, ఆరోగ్య శ్రీ అనే రెండు అంశాలు అమలుకు తేగా (నిజానికి ఆరోగ్య శ్రీ పరిధిని రూ.10 లక్షలకు పెంచటం కేసీఆర్ ప్రభుత్వం ఏడాది క్రితమే చేసింది) ఇంకా మూడు మిగిలి ఉన్నాయి.

ఆ విధంగా మొత్తం 13 ఉప అంశాలలో ఇంకా 11 అమలు కావలసి ఉంది. పోతే, రైతు భరోసా లోని మూడు ఉప అంశాలలో ఒకటి మాత్రం అమలుకు వచ్చింది. అది కూడా కొంత మేరకే. రైతులకు ఎకరానికి పంటకు రూ.7,500 అని చెప్పగా, ఈ పంటకు పాత పద్ధతిలో రూ.5,000 మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రభుత్వం పెట్టుకున్న గడువు 100 రోజులు అయినందున, వచ్చే మార్చి 15లోగా తక్కిన రూ.2500 బకాయి చెల్లించవలసి ఉంటుంది. అట్లాగే ఆ సరికి మిగిలిన 11 ఉప అంశాలు అమలుచేయవలసి వస్తుంది. అదేవిధంగా కార్డుకు చట్టబద్ధత.

మార్చి నాటికి కొత్త ప్రభుత్వం తన బడ్జెట్‌ను ప్రతిపాదిస్తుంది గనుక, తమ మ్యానిఫెస్టో యావత్తు అందులో ప్రతిఫలించగలదని ప్రజలు ఆశిస్తారు. అందులో భాగంగా ఈ 13 ఉప అంశాలు శాశ్వత ప్రాతిపదికపై, పూర్తిస్థాయిలో ఉండాలి.

> ఈ ఆరు గ్యారంటీ హామీలలో ప్రభుత్వం నగదు రూపంలో ఈ 100 రోజులలోనే చెల్లించవలసినవి మహిళలకు నెలకు రూ.2500, రైతులకు, కౌలుదారులకు ఎకరానికి రూ.15,000 లెక్క చొప్పున ఈ యాసంగికి రూ.7,500, వ్యవసాయ కూలీలకు అదే ప్రకారం సగం చేసినా రూ.6,000, కల్లాలలో ఉన్న వరికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్, ఇల్లులేని వారికి జాగతోపాటు రూ.5 లక్షలు, నెలవారీ పింఛన్లు రూ.4,000. మిగిలిన మొత్తాలు గ్యాస్ ఏజెన్సీలు, ఆర్టీసీ, విద్యుత్తు సంస్థలు, వైద్య సంస్థలకు భర్తీ చేయవలసినవి గనుక ఆ బిల్లులు ఆపి ఉంచవచ్చు.

ఇవిగాక తక్కిన మ్యానిఫెస్టో హామీల్లోనూ నగదు చెల్లింపుల అంశాలు అనేకం ఉన్నాయి. ఉదాహరణకు రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ, ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12,000 సహాయం, నిరుద్యోగులకు నెలకు రూ.4,000 భృతి, ఎస్సీ, ఎస్టీలకు దళితబంధు తరహాలో రూ.12 లక్షల ఆర్థిక సహాయం, దివ్యాంగుల పింఛన్లు రూ.6,000కు హెచ్చింపు, కళాకారులకు పింఛన్లు నెలకు రూ.3,000 మొదలైనవి. ఇందులో రుణమాఫీ అయితే రేవంత్‌రెడ్డి తాము అధికారానికి వచ్చిన వెంటనే డిసెంబర్ 9 నాడు ఆ పని చేయగలమని, రైతులు వెంటనే బ్యాంకులకు వెళ్లి రెండేసి లక్షలు రుణం తెచ్చుకోవాలని చెప్పారు. ఆ మాఫీ ప్రకటన ఆ రోజున రాలేదన్నది అటుంచితే, ప్రజలు మొదట 100 రోజుల గడువు హామీల కోసం మరీ ముఖ్యంగా ఎదురుచూస్తారు. గ్యారంటీ కార్డుపై ఇక్కడి కాంగ్రెస్ నాయకులే గాక ఢిల్లీ వారు కూడా పదే పదే నమ్మబలికారు గనుక. అట్లా మార్చి 15 వరకు 100 రోజుల కాలంతో పాటు ప్రభుత్వం ప్రతిపాదించే కొత్త బడ్జెట్ పద్దుల కోసం కూడా ఎదురుచూస్తారు.

ఇదంతా వివరించుకోవటం ఎందుకంటే, 6 గ్యారంటీలకు మొదటి మంత్రివర్గ సమావేశంలోనే చట్టబద్ధత కల్పిస్తామని ఆ పనిచేయకపోవటంపై, రైతుభరోసా సొమ్ము తగ్గటంపై, ఎందుకు తగ్గించారో తక్కిన రూ.2500 మాటేమిటో వివరణ లేకపోవటంపై, అధికారానికి రాగానే డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ హామీపై, మొదటి క్యాబినెట్ మీటింగులోనే మెగా డీఎస్సీ అన్న మాట గురించి, కల్లాలలో గల పంటకు రూ.500 బోనస్ విషయమై గ్రామాలలో, ఇతరత్రా కూడా మాటలు వినవస్తున్నాయి. ప్రజావాణి ప్రతిరోజు అని చెప్పి అంతలోనే వారానికి రెండురోజులు చేయటంపై వ్యాఖ్యానిస్తున్న వారు కూడా ఉన్నారు. వేలకు వేలుగా వస్తున్న వినతి పత్రాల పరిష్కారం మాట సరేసరి. అది కొంత కాలం వేచి చూడవలసిన విషయం.

మొత్తమ్మీద అటు ప్రజలు, మరొక వైపు నిపుణులు, మేధావుల్లో హామీల అమలు సాధ్యాసాధ్యాలపై జరుగుతున్న చర్చలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచగలవని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. అమలు వెనుకముందులు అయే పక్షంలో ఒత్తిడి ఇంకా పెరుగుతుంది. ఈ స్థితి అంతా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి బలి పశువులను వెతికే అవసరాన్ని సృష్టించవచ్చు. కాని అట్లా సాకులు వెతికే ప్రయత్నం చేసినట్టయితే తమ విశ్వసనీయత దెబ్బతినగలదని, ప్రజలు ఆ ప్రయత్నాలను ఆమోదించబోరని కాంగ్రెస్ ప్రభుత్వం తెలుసుకోవాలి. ■

# పార్లమెంట్‌పై దాడి.. చర్చ పక్కదారి!



రోహిత్ ఖన్నా
'ది క్వింట్' సౌజన్యంతో

మన దేశంలో అత్యంత భద్రత మధ్య ఉండే పార్లమెంట్ భవనంలో భద్రతా వైఫల్యం యావత్ భారతావనిని నివ్వెరపరిచింది. ఇద్దరు ఆగంతకులు సభా కార్యక్రమాలు జరుగుతుండగానే లోక్‌సభలోకి ప్రవేశించడం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. ఊహకందని ఈ ఘటనతో ఎంపీలు భయాందోళనకు గురయ్యారు. ఈ సంచలన ఘటనపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్నది. అయితే ఈ చర్చల మాటున అసలు విషయం మరుగున పడుతున్నది. భద్రతా ఉల్లంఘనకు పాల్పడిన, సహకరించిన వారందరూ దాదాపు ఒకే వయసున్న వారు కావడం గమనార్హం. వారంతా విద్యావంతులైన నిరుద్యోగులు కావడం అసలు చర్చకు రావాల్సిన అంశం.



అసలు విషయం ఏమంటే ఎవరికీ తెలియని, ఎక్కడా చర్చకు రాని మన దేశంలో ఉన్న విద్యావంతుల నిరుద్యోగం. పార్లమెంట్ భవనంలో భద్రతా వైఫల్యానికి పాల్పడినవారిని పరిశీలిస్తే.. సాగర్ శర్మ పన్నెండో తరగతి వరకు చదువుకున్నాడు. 28 ఏండ్ల వయసున్న ఆయన లక్నోలో ఈ-రిక్షా నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. 34 ఏండ్ల మనోరంజన్ ఐటీ ఇంజినీర్ ఏండ్లుగా ఉద్యోగ అన్వేషణలోనే ఉన్నాడు. హర్యానాకు చెందిన 37 ఏండ్ల నీలం వర్మ ఎంఏ, ఎంఫిల్ చదివింది. హర్యానా ప్రభుత్వం నిర్వహించిన టీచర్ ఎలిజిబిలిటీ టెస్టులో ఉత్తీర్ణత సాధించింది. అయినప్పటికీ ఆమెకు ఉద్యోగం రాలేదు. మహారాష్ట్రకు చెందిన 25 ఏండ్ల అమోల్ షిండే పన్నెండో తరగతి వరకు చదువుకున్నాడు. ఆర్మీ, పోలీస్ ఉద్యోగాల కోసం ప్రయత్నించి విఫలమయ్యాడు.

వేర్వేరు ప్రాంతాలు, వేర్వేరు నేపథ్యాలు కలిగిన వీరంతా సోషల్ మీడియా వేదికగా ఒక్కటయ్యారు. భద్రతా ఉల్లంఘనకు పాల్పడి పార్లమెంట్‌లోకి ప్రవేశించాలనుకున్నారు. అనుకున్నట్టే రంగుల పొగను వదిలి భద్రతా సిబ్బందికి పట్టుబడ్డారు. ఉపా చట్టాన్ని వారిపై మోపి తీవ్రవాదులుగా ముద్ర వేసే ముందు, వారు లేవనెత్తాలనుకున్న అసలు అంశం ఏమిటనేది మనం మర్చిపోతున్నాం.

దేశంలోని వివిధ రాష్ట్రాలు హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన వారి నేపథ్యాలు వేరు కావచ్చు.. కానీ, అందరిలోనూ ఉన్న సారూప్యత ఏమంటే భారతదేశంలో తాండవిస్తున్న నిరుద్యోగం. పైన పేర్కొన్నట్టుగా దేశంలో నెలకొన్న ప్రధాన సమస్య విద్యావంతుల నిరుద్యోగం. ఉన్నత చదువులు చదివిన కోట్ల మంది యువత ఉపాధి దొరక్క రోడ్లపై తిరుగుతున్నారు. ఈ నిరుద్యోగం మనకు కార్మిక, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖల నివేదికల్లో మాత్రమే కనిపిస్తుంది. అప్పుడప్పుడు ఇలా తమ డిమాండ్లను వినిపించేందుకు పార్లమెంట్ భద్రతా ఉల్లంఘనల రూపంలో నిరుద్యోగులు బయటకువస్తారు.

2021లో అజీజ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. మన దేశంలో డిగ్రీ పూర్తి చేసినవారిలో నిరుద్యోగిత రేటు 15 శాతం ఉన్నది. అదే విధంగా డిగ్రీ పూర్తి చేసిన 25 ఏండ్లలోపు వారిలో చూస్తే 42 శాతం ఉండటం గమనార్హం. హై స్కూల్ డిగ్రీలు పొందిన వారిలో 21.4 శాతం ఉన్నది.

యువత చదువు, వారి నైపుణ్యానికి తగ్గట్టుగా ఉద్యోగాలను సృష్టించడంలో మన ప్రభుత్వాలు విఫలమయ్యాయి. నిరుద్యోగుల్లో కొంతమంది ముంబై, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, పుణె తదితర నగరాల బాట పడుతున్నారు. అక్కడ ఏదో ఒక పని చూసుకుంటున్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లోని అనేకమంది ఉపాధి కరువై కాలం వెళ్లదీస్తున్నారు. అదే నివేదిక మరో విస్తుగొలిపే వాస్తవాన్ని బయట పెట్టింది. 35 ఏండ్లకు పైబడిన వయసు ఉండి డిగ్రీ విద్యార్హత కలిగిన వారిలో నిరుద్యోగిత రేటు 5 శాతమే ఉండటాన్ని గమనించాలి. దీనర్థం ఏమంటే.. 35 ఏండ్లు వచ్చేసరికి తమ చదువు, ఆశయం, ఆకాంక్షలు, నైపుణ్యానికి విరుద్ధమైన రంగాల్లో స్థిరపడుతున్నారు. కుటుంబాన్ని పోషించేందుకు చిన్నాచితకా పనులు చూసుకుంటున్నారు.

ఓ సంస్థ సర్వే ప్రకారం.. సుమారుగా 7,25,000 మంది భారతీయులు అమెరికాలో అక్రమంగా ఉంటున్నారు. మెక్సికో, ఎల్ శాల్వడార్ తర్వాత మూడో స్థానం మనదే. లక్షలాది మంది యువత అక్రమంగా అక్కడ ఎందుకు ఉంటున్నారో అందరికీ తెలిసిందే. వారంతా ఉన్నత చదువులు చదివినవారే. మన దేశంలో నైపుణ్యానికి తగ్గట్టుగా ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వలస పోతున్నారు. అమెరికా సహా ఇతర దేశాల్లో జీవనాధారాన్ని వెతుక్కుంటున్నారు.

> పర్యావరణవేత్తలు మోనాలిసా చిత్రాన్ని ధ్వంసం చేసినట్టే.. మన దేశంలోని చదువుకున్న నిరుద్యోగులు ఈ విధంగా తమ నిరసనను తెలియజేశారు. దేశవ్యాప్త సంచలనం కోసం ఈ క్రమంలో వారు ఆయా దేశాల్లోని చట్టాలను ఉల్లంఘించారు. సాధారణంగా చెప్తే దేశం దృష్టి సారించదని తెలిసే వారు ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. నా అభిప్రాయం ప్రకారం పార్లమెంట్ ఘటనలో జరిగిందిదే. భద్రత ఉల్లంఘన ఎలా జరిగిందో మన ఏజెన్సీలు కనుగొన్నప్పటికీ అసలు విషయాన్ని విస్మరిస్తున్నాయి.

దేశంలోని నిరుద్యోగులు తమ దుస్థితికి కారణం తాము ఎన్నుకున్న నాయకులే అని ఇప్పటికీ గ్రహించలేకపోతుండటం విచారకరం. ఎన్నికల సమయంలో నిరక్షరాస్యులు, విద్యావంతులతో పాటు మన పాలకులు కూడా నిరుద్యోగం లాంటి ప్రధాన అంశాలను పక్కనపెడుతున్నారు. కులం, మతం తదితర అంశాలే తెరపైకి వస్తున్నాయి. వాటి ఆధారంగానే ఎన్నికలు జరుగుతున్నాయి. ఓటర్లలోనూ మార్పు రావాల్సిన అవసరం ఉన్నది. అదే సమయంలో విద్యావంతులు, నైపుణ్యం కలిగిన నిరుద్యోగులకు ఉపాధి చూపించాల్సిన అవసరాన్ని మన ప్రభుత్వాలు గుర్తించాలి. ఈ విషయంలో విఫలమైతే జనాభా డివిడెండ్ కాస్త జనాభా డిజాస్టర్‌గా మారే ప్రమాదం ఉన్నది.

*అనువాదం: మాలోతు సురేష్*